క్లుప్తంగా

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానా

మిర్యాలగూడ అర్బన్ : మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేశారు. అందులో పదిమంది మద్యం తాగినట్లు గుర్తించి సోమవారం కోర్టులో హాజరుపర్చగా వారికి జడ్జి రూ.15,600 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్‌ఐ మోహన్‌యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభం

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో సోమవార ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌పై దాడి అమానుషం

మిర్యాలగూడ టౌన్ : అచ్చంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ అరుణపై రైతులు దాడి చేయడం అమానూషమని ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు, మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్యవైశ్యులు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఉండటం, రాజకీయంగా ఎదగడం కొంతమంది జీర్ణించుకోలేకపోవడంతో ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారన్నారు. సమాజంలో అన్ని కులాలతో పాటు వైశ్యులు కూడా రాజకీయాల్లో ఉండే హక్కు ఉందన్నారు. మహిళా అని కూడా చూడకుండా దాడికి పాల్పడటం విడ్డూరంగా ఉందన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

మిర్యాలగూడ టౌన్ : హాస్టళ్లల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని మండల తహసీల్దార్ హరిబాబు అన్నారు. సోమవారం పట్టణంలోని గిరిజన బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. అనంతరం బాలికలతో కలిసి భోజనం చేసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు మెనూ పాటించాలన్నారు. నాణ్యమైన కూరగాయాలు తీసుకొచ్చి నాణ్యమైన ఆహార పదార్థాలు కూడా ఉపయోగించాలన్నారు. హాస్టళ్లను తాను ఎప్పుడైన ఆకస్మికంగా తనిఖీ చేసానని హెచ్చరించారు.

మున్నూరు కాపు సంఘం నూతన కమిటీ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన మున్నూరు కాపు సంఘం సభ్యులు

హాలియా : హాలియా మున్సిపాలిటీ మున్నూరు కాపు సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం పట్టణంలో హాలియా మున్సిపాలిటీ కేంద్రంలో నిర్వహించిన ఆసంఘం సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోపిశెట్టి నరసింహ, ప్రధాన కార్యదర్శిగా కొత్త వెంకటేష్, కోశాధికారిగా సురుగు నారాయణ, ఉపాధ్యక్షులుగా చాపల వెంకటేశ్వర్లు, ఎడ్ల సోమయ్య, లోకసాని పాండు, కార్యదర్శిగా బండి సైదులు, కార్యనిర్వాహక కార్యదర్శిగా లోకసాని శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా గోపిశెట్టి సైదులును ఎన్నుకున్నారు.

ఘనంగా మార్కండేయ స్వామి జయంతి


మార్కండేయ స్వామి చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని పద్మశాలి భవనంలో సోమవారం మార్కండేయ స్వామి జయంతిని పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు జెల్లా రాంబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా మార్కండేయ స్వామి చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం మార్కండేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మిర్యాల కృష్ణయ్య, బావండ్ల పాండు, బాలకృష్ణ, రామ ప్రసాద్, మసురం కృష్ణమూర్తి, శ్రీనివాస్ నాయకులు, పాల్గొన్నారు.

మాడుగులపల్లి ఎంపీడీఓ బదిలీ

మాడుగులపల్లి : మాడుగులపల్లి ఎంపీడీఓ దండా జితేందర్‌రెడ్డి బదిలీ అయ్యారు. నాలుగేళ్లకు పైగా ఆయన ఇక్కడ ఎంపీడీఓగా సేవలందించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆలేరు లేదా ఆత్మకూర్ (ఎం)కు ఆయన బదిలీపై వెళ్లనున్నట్లు తెలిసింది. నూతన ఎంపీడీఓ వచ్చేంత వరకు ఎంపీఓ రవికుమార్ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిపారు.

హాలియాలో తాగునీటి కష్టాలు

మరమ్మతులకు గురైన పైప్‌లైన్ గేట్వాల్
- 15 రోజులుగా ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- మరమ్మతులు చేయించాలని ప్రజల వేడుకోలు


పట్టణ ప్రజలకు తాగు నీరు అందించే ఓవర్‌హెడ్ ట్యాంకు, మరమ్మతులకు గురైన గేట్వాల్

హాలియా : రానున్న వేసవిలో నీటి కష్టాలు రావొద్దని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది. గత ప్రభుత్వం ఇంటింటికీ తాగునీరు అందించేందుకు ప్రవేశపెట్టిన తాగునీటి పథకం నిర్వహణ హాలియా మున్సిపాలిటీలో అస్తవ్యస్తంగా మారింది. దీంతో మున్సిపాలిటీ పట్టణంలో పూర్తిస్థాయిలో తాగునీరు అందడం లేదు. హాలియా మున్సిపాలిటీ పట్టణంలోని 5, 6, 10, 11, 12 వార్డు ప్రజలకు 15 రోజులుగా ఇంటింటికీ నల్లా నీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేసవి రాకముందే హాలియా మున్సిపాలిటీలో నీటి ఎద్దడి నెలకొంది.

ట్యాంకు వరకు వచ్చి..

హాలియా మున్సిపాలిటీలోని తాగు నీరు ఓవర్ హెడ్ ట్యాంకు వరకు వచ్చి ఇంటింటికీ ఉన్న నల్లా వరకు రావడం లేదని పలు వార్డు ప్రజలు వాపోతున్నారు. మున్సిపాలిటీ పట్టణ ప్రజలకు తాగు నీరు అందించడానికి హాలియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకును ఏర్పాటు చేశారు. విద్యుత్ మోటారు ద్వారా వాటర్ ట్యాంకులో నింపి పట్టణ ప్రజలకు నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం మోటారు ద్వారా ట్యాంకు మాత్రం నీటితోనే నిండుతోంది. కానీ ఇక్కడి నుంచి వార్డులకు మాత్రం నీరు సరఫరా కావడం లేదు. దీనికి కారణం వాటర్ ట్యాంకు నుంచి నల్లాలకు సరఫరా అయ్యే గేట్వాల్ మరమ్మతులకు గురై 15రోజులు అవుతున్న పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ప్రస్తుతం పలు వార్డు ప్రజలకు గత కొంత కాలంగా తాగునీరు అందక నానా ఇబ్బందులు పడుతున్నారు.

మరమ్మతులు చేపడితే..

గేట్వాల్ మరమ్మతులకు గురి కావడం వల్ల పట్టణంలోని పలు వార్డులకు ఇంటింటికి నల్లా నీరు దరిచేరడం లేదు. గేట్వాల్‌ను మరమ్మతులు చేయించాలంటే రూ. 50వేలు ఖర్చు అవుతోందని ఇంత భారాన్ని తాము మోయలేమంటూ మున్సిపల్ అధికారులు గేట్వాల్‌ను మర్మమతులు చేయించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గేట్వాల్‌కు మర్మమతులు చేయకపోవడం కారణంగానే పట్టణ ప్రజలకు కొద్ది రోజులుగా తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. స్థానికంగా ఉన్న ఇతర ప్రాంతాలకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి ఇంటింటికి భగీరథ నీరు చేరే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

చుక్క నీరూ రావడం లేదు



15 రోజులుగా మా కాలనీకి చుక్కనీరు రావడం లేదు. తాగునీటి కోసం కష్టాలు పడాల్సి వస్తుంది. వేసవి రాకముందే పట్టణంలో నీటి ఎద్దడి నెలకొంది. ట్యాంకు ద్వారా సరఫరా అయ్యే గెట్వాల్‌ను మరమత్తులు చేయిస్తే పట్టణంలోని ప్రజలకు ఇంటింటికి తాగునీరు చేరుతోంది.

–ముజ్జ రవి, హాలియా

మరమ్మతులు చేపడుతాం

ప్రస్తుతం హాలియా పట్టణంలో నీటి ఎద్దడి ఉంది. మున్సిపాలిటీలో 20 బోర్లు ఉండగా 10 బోర్లు మాత్రమే పని చేస్తున్నాయి. హాలియాలోని ఓవర్‌హెడ్ ట్యాంకు ద్వారా సరఫరా అయ్యే గెట్వాల్ మరమ్మతులకు గురి కావడం వల్ల ప్రజలకు తాగునీరు అందడం లేదు. ప్రస్తుతం ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నాం. రెండు, మూడు రోజుల్లో గెట్వాల్‌ను మరమ్మతులు చేయించి ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరిస్తాను.

–కందిమళ్ల వీరారెడ్డి, మున్సిపల్ కమిషనర్, హాలియా

ప్రాజెక్టుల అప్పగింతపై కాంగ్రెస్‌ది ద్వంద్వ వైఖరి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సురేందర్

హాలియా : ప్రాజెక్టులను కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు(కేఆర్ఎంబీ)కు అప్పగించలేదంటూనే సోమవారం అసెంబ్లీలో తీర్మానం చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని మాజీ ఎమ్మెల్యేలు జాజుల నరేందర్, నోముల భగత్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే భగత్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 13న జరిగే 'చలో నల్లగొండ'సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాపాడితే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 60రోజుల్లోనే కేంద్ర ప్రభుత్వానికి అప్పజెప్పిందని విమర్శించారు. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగిస్తే భవిష్యత్‌లో ఐదు జిల్లాలు ఎడారికి మారే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ట్రికార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్ నాయక్, మార్కెట్ చైర్మన్ జవ్వాజి వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ వివిధ మండలాల అధ్యక్షులు కూరాకుల వెంకటేశ్వర్లు, పిడిగం నాగయ్య, జటావత్ రవినాయక్, తాటి సత్యపాల్, బీఆర్ఎస్ నాయకులు అనుముల శ్రీనివాస్‌రెడ్డి, గజ్జెల శ్రీనివాస్‌రెడ్డి, సురభి రాంబాబు, శ్రీకర్ నాయక్, శంకర్‌నాయక్, మల్లిఖార్జున్, యాదయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సాయం అభినందనీయం

త్రిపురారం : ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు పూర్వ విద్యార్థులు చేస్తున్న సాయం అభినందనీయమని త్రిపురారం ఎంఈఓ బాలాజీ నాయక్ అన్నారు. మండలంలోని నీలాయి గూడెం ప్రభుత్వ పాఠశాలలో 2000-2001 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆర్థిక సహకారంతో నీలాయి గూడెం, త్రిపురారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకుంటున్న విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పూర్వ విద్యార్థులతో కలిసి సోమవారం అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కర్నాటి వెంకటేశ్వర్లు, వెంకట్ పూర్వ విద్యార్థులు మడుపు వెంకటేశ్వర్లు, రేపూరి దశరథ, వెంకటేశ్వర్లు, పామోజు సైదాచారి, అవిరెండ్ల వీరయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లలకు బాలామృతం అందజేత

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీ హిల్ కాలనీలోని ఐదో అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పిల్లలకు బాలామృతంతో పాటు గుడ్లను సూపర్‌వైజర్ గౌసియాభేగం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరు నుంచి 36నెలల వయస్సు గల పిల్లలకు బాలమృతంతో పాటు గుడ్లు, పౌష్టికాహారం అందజలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. దీంతో పాటు సామ్‌మామ్ కార్యక్రమంలో భాగంగా వయస్సుకు తగిన బరువు, ఎత్తు పిల్లలు ఉన్నారో లేరోనని వారిని తూకం వేయడంతో పాటు ఎత్తులను కొలిచారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త కె.సుధా, ఆయా పిచ్చమ్మ, బాలింతలు, గర్భిణులు, పిల్లలు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత


దేవరకొండ : సమ్మె నోటీసు అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

దేవరకొండ : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16న నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నల్లా వెంకటయ్య పిలుపునిచ్చారు. సోమవారం దేవరకొండ మున్సిపల్ కార్యాలయంలో సమ్మె నోటీసు అందజేసి ఆయన మాట్లాడారు. రైతులకు ఇచ్చిన వాగ్దానాలను కేంద్రంలో ఉన్న నరేంద్రమోదీ ప్రభుత్వం విస్మరించిందని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు తారమ్మ, మల్లమ్మ, ఏసోబు, రత్నమ్మ, వెంకటమ్మ పాల్గొన్నారు.

సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

కొండమల్లేపల్లి : కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న దేశ వ్యాప్తంగా తలపెట్టిన సార్వత్రి సమ్మె ప్రచార పోస్టర్‌ను సోమవారం మండల కేంద్రంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షుడు నూనె రామస్వామి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు అలమోని మల్లయ్య, పెద్ద బాలు, రమావత్ సోమ్లా, చందర్, కిషన్, రూప్‌సింగ్, హతిరాం తదితరులు పాల్గొన్నారు.

హాలియా సీఐగా రాఘవరావు బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న హాలియా సీఐ


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ రవికుమార్

హాలియా : హాలియా సర్కిల్ నూతన సీఐగా రాఘవరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో హాలియా సీఐగా పని చేసిన గాంధీనాయక్ బదిలీపై మహబూబ్‌నగర్ జిల్లాకు వెళ్లగా ఆయన స్థానంలో సూర్యాపేట జిల్లాలోని శాలిగౌరారం సర్కిల్ నుంచి రాఘవరావు బదిలీపై హాలియా పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా నూతన సీఐ రాఘవరావు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ఉత్తమంగా సేవలు అందిస్తానని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు.

దామరచర్ల ఎస్ఐగా రవికుమార్

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని వాడపల్లి నూతన ఎస్ఐగా రవికుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్ఐ మామిడి రవికుమార్ నార్కట్‌పల్లి బదిలీ కావడంతో ఆయన స్థానంలో చిట్యాల ఎస్ఐగా పనిచేస్తున్న రవికుమార్ బదిలీపై వాడపల్లికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటానని ఆయన హెచ్చరించారు.

పెద్దవూర ఎస్ఐగా వీరబాబు


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ వీరబాబు

పెద్దవూర : పెద్దవూర ఎస్ఐగా పి.వీరబాబు సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో పెద్దవూర ఎస్ఐగా పనిచేసిన అజ్మీరా రమేష్ నల్లగొండ ట్రాఫిక్ ఎస్ఐగా బదిలీపై వెళ్లారు. అతడి స్థానంలో పి.వీరబాబును బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఉత్తమ సేవలు అందించటానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు.

రెండో విడత గొర్రెల పంపిణీని చేపట్టాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీసీ, యాదవ సంఘాల నాయకులు

మిర్యాలగూడ : నల్లగొండ జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రెండో విడత గొర్రెల పంపిణీని వెంటనే చేపట్టాలని బీసీ, యాదవ సంఘం నాయకులు సోమవారం నల్లగొండలో జిల్లా కలెక్టర్ హరిచందనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ పగిడి జీడయ్య యాదవ్ మాట్లాడారు. బంగారం తాకట్టు పెట్టి, వడ్డీకి అప్పులు తెచ్చి మరీ డీడీలు కట్టి ఏడాది పూర్తయినప్పటికీ గొర్రెలు పంపిణీ చేయడం లేదన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చిన విధంగా వంద రోజుల్లో రెండో విడత గొర్రెలను పంపిణీ చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజుల శ్రీను, నాయకులు గంగుల బంగారు, అమరయ్య, యాదగిరి, సైదులు, శ్రీను, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

మాడుగులపల్లి : రెండో విడత గొర్రెల యూనిట్ల కోసం డీడీలు చెల్లించిన వారందరికీ ప్రభుత్వం వెంటనే గొర్రెలు పంపిణీ చేయాలని గొర్రెల, మేకల పెంపకందారుల సహకార సంఘం జిల్లా జిల్లా కార్యదర్శి ఊరిబండి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా 7,200 మంది గత ప్రభుత్వంలో రూ. 43,700 చొప్పున డీడీలు చెల్లించి ఏడాదిగా గొర్రెల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. . పంపిణీపై సీఎం నిర్ణయం తీసుకోవాలని కోరారు.

పావలా వడ్డీ రుణాల మంజూరులో నిర్లక్ష్యం


మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న వరలక్ష్మి

మిర్యాలగూడ అర్బన్ : మహిళలు ఆర్థికంగా భలపడేందుకు పావలా వడ్డీ రుణాలు ఇవ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు పద్మావతి, జిల్లా అధ్యక్షురాలు పోలేబోయిన వరలక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని తడకమళ్ల గ్రామంలో మహిళల సమస్యలపై సర్వే చేసిన అనంతరం సభ్యత్వ నమోదును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పొదుపు సంఘాల మహిళలు పైసా పైసా కూడబెట్టి దినదినం అభివృద్ధి చెందాలని ప్రయత్నం చేస్తుంటే బ్యాంకుల్లో బలవంతంగా డిపాజిట్లు చేయించడం ఏంటని, డిపాజిట్లు తిరిగి ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి మహిళకు బీమా సౌకర్య కల్పించాలని, పొదుపు సంఘాల మహిళల పిల్లలకు స్కాలర్‌షిప్ సౌకర్యం మంజూరు చేయాలని, సమభావన సంఘాలకు భవనం నిర్మించాలని కోరారు. మహిళల సమస్యలపై సర్వే నిర్వహించి సమస్యలన్నింటి పైన జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సైదమ్మ, మంగమ్మ, లక్ష్మమ్మ, రాములమ్మ ఉన్నారు.

అక్రమ తూముతో రైతులకు ఇబ్బందులు


అక్రమంగా ఏర్పాటు చేసిన తూము

మిర్యాలగూడ : దామచర్ల మండలం వజీరాబాద్ మేజర్ పరిధిలోని బాలాజీనగర్‌లో కొందరు కాలువను జేసీబీతో తవ్వి తూము ఏర్పాటు చేసి అక్రమంగా నీటిని తరలిస్తున్నారు. ఎడమకాల్వ పరిధిలోని మేజర్ కాల్వపై అక్రమ తూము ఏర్పాటు చేసి నీటిని మళించడం వల్ల కాల్వ చివరి భూములకు నీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అక్రమ తూము ఏర్పాటు చేసి నీటిని దిగువన ఉన్న కొండ్రపోల్ ఊర చెరువుకు తరలిస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ఎన్ఎస్పీ అధికారుల నిర్లక్ష్యంతో కొందరు ఇలాంటి అక్రమ తూములు ఏర్పాటు చేసుకుంటున్నారని, నీటిని మళ్లించడం వల్ల దిగువన ఉన్న 7వేల ఎకరాల ఆయకట్టుకు నీరందని పరిస్థితి నెలకొంటుందని, దాంతో పంట పొలాలు ఎండిపోయే ప్రమాదం ఉంటుందని పేర్కొంటున్నారు. తూము ఏర్పాటు చేసిన ప్రాంతం కాల్వకట్ట డీప్‌కట్ ఉండడంతో భవిష్యత్‌లో పెద్ద గండి పడే ప్రమాదం లేకపోలేదు. కాగా నాలుగు రోజుల క్రితం రైతులు తూము ఏర్పాటు చేస్తుండగా దిగువ రైతులు, ఇరిగేషన్ అధికారులు అట్టి పనులను అడ్డుకోగా తిరిగి గుట్టుచప్పుడు కాకుండా పనులు చేపట్టి తూము ఏర్పాటు చేశారు. ఈ తూము ఏర్పాటుకు ఎలాంటి అనుమతులు లేవని అధికారులు పేర్కొంటున్నారు. వెంటనే ఆ తూమును తొలగించి ఆయకట్టు రైతులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని ఆందోళన


పెద్దవూర : గురుకుల పాఠశాలలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

మిర్యాలగూడ : బదిలీలు, పదోన్నతులు చేపట్టిన తరువాతనే ప్రభుత్వం నియామకాలు చేపట్టాలని సోమవారం దామరచర్ల మండల కేంద్రంలో పలువురు ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్స్ భూక్యా మంగ్తా, విజయలలితలు మాట్లాడుతూ గిరిజన గురుకులాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు వేతనాలు అందివ్వాలని, గురుకులాలకు సొంత భవనాలతోపాటు ఉద్యోగులకు క్వార్టర్స్‌ను నిర్మించాలని కోరారు.సీ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కల్యాణ్‌కుమార్, ఉపాధ్యాయులు సరితరెడ్డి, అంజయ్య, నర్సిరెడ్డి, అంజయ్య, శ్రవణ్, నరేందర్, ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

పెద్దవూర: తెలంగాణ గురుకుల సొసైటీ రిక్రూట్‌మెంట్ కంటే ముందే ఉపాధ్యాయులు పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ విధుల్లో పాల్గొంటూనే సోమవారం మండల కేంద్రంలోని ఎస్టీ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రిటా రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఎన్.సరిత, జిల్లా రీజియన్ కార్యదర్శి వెంకట్‌రెడ్డి , ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రెడ్డి, ట్రిటా మండల అధ్యక్షుడు ఎం.ఉపేందర్, కార్యదర్శి తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయులు ఎం.శ్రీలత, జి.శ్రీధర్‌రెడ్డి, మాధవి, కరుణశ్రీ, లక్ష్మీ చైతన్య, వినయ్‌కుమార్, లింగారెడ్డి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ డిప్యుటేషన్లు రద్దు చేయాలని వినతి


స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అడవిదేవులపల్లి : అక్రమ డిప్యుటేషన్లు తక్షణమే రద్దు చేయాలని కోరుతూ సోమవారం తెలంగాణ స్టేట్ యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అబ్బాస్ అలీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ అడవిదేవులపల్లి మండల కేంద్రంలో ఎంపీపీఎస్ (హరిజనవాడ)పాఠశాల నుంచి ఒక ఉపాధ్యాయుడిని కొత్తనందికొండ ఎంపీపీఎస్‌కు, కొత్తనందికొండ ఎంపీపీఎస్ నుంచి అడవిదేవులపల్లి (హరిజనవాడ) పాఠశాలకు ఎటువంటి ప్రభుత్వ ఉత్తర్వులను లేకుండానే అక్రమంగా డిప్యూటేషన్ చేశారని, ఇలా డిప్యూటేషన్లు చేయడం అక్రమమన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో టీఎస్ యూటీఎఫ్‌మండల ప్రధాన కార్యదర్శి శ్యాంకుమార్, ఉపాధ్యక్షురాలు మునీశ్వరీ, కాంప్లెక్స్ కన్వీనర్ సతీష్, సహాదేవ, శ్రీనయ్య తదితరులు పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి


ఆర్డీఓ కార్యాలయ అధికారికి వినిపత్రం అందజేస్తున్న నాయకులు

దేవరకొండ : రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల పలు గురుకులాల్లో చోటు చేసుకుంటున్న విద్యార్థుల మృతిపై రాష్ట్ర హైకోర్టు సిట్టింగ్ జడ్జి ద్వారా న్యాయ విచారణ జరిపించాలని ఆలిండియా సమతా సైనిక్‌దళ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బుర్రి వెంకన్న ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆలిండియా సమతా సైనిక్ దళ్ నియోజకవర్గ కన్వీనర్ వస్కుల రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో దేవరకొండ ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్ర అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లో ప్రభుత్వం ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. మరణించిన విద్యార్థుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు కంబాలపల్లి వెంకటయ్య, అందుగుల గిరి, చేపూరి రాజేష్, యాదగిరి, నాగరాజు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

త్రిపురారం : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని త్రిపురారం పోలీసులు పట్టుకున్నారు. త్రిపురారం మండలంలోని రాగడప గ్రామ శివారులో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో వెళ్తున్న ఆశోక్ లెలాండ్ వాహనంపై అనుమానం రావడంతో ఆపి తనిఖీ చేయగా సుమారు 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడింది. డ్రైవర్‌తో పాటు ఉన్న ఓ మహిళను విచారించగా మండలంలోని సీత్యాతండాకు చెందిన దనావత్ జైపాల్, సాలమ్మలుగా ఒప్పుకున్నారు. మండలంలోని చుట్టపక్కల గ్రామాల నుంచి బియ్యం సేకరించి అడవిదేవులపల్లి మీదుగా ఆంధ్రప్రాంతానికి తరలించి ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ వాహనాన్ని స్టేషన్‌కు తరలించి ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం


అడవిదేవులపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులతో విద్యార్థులు


కొండమల్లేపల్లి : చింతకుంట్ల జెడ్పీహెచ్ఎస్‌లో ..

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం స్వపరిపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా, ప్రజాప్రతినిధులుగా, అధికారులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎండీ అబ్బాస్‌అలీ, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, రవి, నీల్యా, అంకిరెడ్డి, ప్రవీణ, సురేష్‌కుమార్, మునేశ్వరీ, శోభ, పార్వతి, వాజీద్‌అలీ, చంద్రకళ, శేఖర్‌రెడ్డి, సోమిరెడ్డి, సోమలింగం, శ్రీనయ్య, సహాదేవ, హిమబిందు, లలిత, హుస్సేన్, సైదా తదితరులున్నారు.

హాలియా : పట్టణంలోని అక్షయ స్కూల్‌లో సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా, ప్రజాప్రతినిధులుగా, వివిధ శాఖల అధికారులుగా వ్యవహరించారు. ముఖ్యమంత్రిగా వరుణ్ సాయి వ్యవహరించి పలువురిని ఆకట్టుకున్నారు. అనంతరం విద్యార్థులకు పాఠశాల డైరెక్టర్ కుర్ర భిక్షపతి బహుమతులను అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వహీద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.


హాలియా : అక్షయ స్కూల్‌లో ..

కొండమల్లేపల్లి : మండలంలోని చింతకుంట్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులుగా వివిధ హోదాల్లో ఒక రోజు విధులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శోభారాణి, ఉపాధ్యాయులు జి.శ్రీరాములు విద్యార్థులు పాల్గొన్నారు.